
మానకొండూర్: పెద్దచెరువులో గణేశ్ నిమజ్జనం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఇతర అధికారులు


వీల్‌చైర్‌పై గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న చిన్నారులు


అమెరికాలోని డల్లాస్‌లో నిమజ్జనోత్సవంలో పాల్గొన్న మేయర్ సతీమణి వై అపర్ణాసునీల్‌రావు

# గణనాథుడికి ఘన వీడ్కోలు

జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా నిమజ్జనోత్సవం • శోభాయాత్రలతో ఊరూరా కోలాహలం
ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారయంత్రాంగం • ప్రశాంతంగా ముగిసిన కార్యక్రమం


భగత్‌నగర్‌లోని మారుతీ వెల్ఫేర్ అపార్ట్‌మెంట్‌లో మట్టి గణపతిని నిమజ్జనం చేస్తున్న భక్తులు


పాతబజార్‌లోని 1వ నంబర్ వినాయకుడి వద్ద కోలాటమాడుతున్న కళాకారులు


పాతబజార్‌లోని 1వ వినాయకుడి శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మేయర్ సునీల్‌రావు తదితరులు

కమాన్‌చౌరస్తా/ మానకొండూర్/ కొత్తపల్లి/వీణవంక/ సైదాపూర్/ ఇల్లందకుంట/ తిమ్మాపూర్/ శంకరపట్నం/ చిగురుమామిడి/ గంగాధర/ కరీంనగర్ రూరల్/ మానకొండూర్‌రూరల్, సెప్టెంబర్ 16: జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనోత్సవం సోమవారం అట్టహాసంగా సాగింది. ప్రత్యేక మండపాల్లో కొలువుదీరి తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడిని భక్తజనం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేసి సాగనంపింది. నిమజ్జన ప్రాంతాల్లో అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయగా, కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. నగరంలో కళాప్రదర్శనలు, భజన కార్యక్రమాల మధ్య గణేశ్ శోభాయాత్ర వైభవంగా సాగింది. గణనాథుడికి టవర్ సర్కిల్, రాంనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆహ్వాన వేదికల వద్ద ప్రముఖులు పూజలు చేయగా, ఉత్సవ కమిటీల నిర్వాహకులు మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట చెరువుల్లో నిమజ్జనానికి తరలించారు. పలుచోట్ల పోలీసులు ట్రాఫిక్ మళ్లించి శోభాయాత్ర సాఫీగా సాగేలా ఏర్పాట్లు చేశారు. ఒకటో నంబర్ గణనాథుడికి కేంద్ర మంత్రి బండి సంజయ్, మేయర్ వై సునీల్ రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బండి సంజయ్ టవర్ వద్దకు చేరుకుని వీహెచ్‌పీ నాయకులతో కలిసి ఒకటో నంబర్ గణనాథుడికి స్వాగతం పలికారు. ఇక్కడ కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మొహంతి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్, వివిధ పార్టీల నాయకులు, హిందూ ఉత్సవ సమితి, వీహెచ్‌పీ బాధ్యులు వేర్వేరుగా పూజలు నిర్వహించారు. ఆయా చోట్ల ఏర్పాట్లను అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ పర్యవేక్షించారు. టవర్ వద్ద గోగుల ప్రసాద్ ఆధ్వర్యంలో సంగెం రాధాకృష్ణ బృందం సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మానకొండూర్ పెద్దచెరువు కట్టపై అధికారులు రెండు భారీ క్రేన్లు, హనుమాన్ టెంపుల్ సమీపంలో క్రీడా ప్రాంగణం వెనుకవైపు ఒక చిన్న క్రేన్ ఏర్పాటు చేయగా, మధ్యాహ్నం నుంచే చిన్న విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రారంభమైంది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కరీంనగర్ నుంచి అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలను ఆయా మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చెరువువద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మానకొండూర్ చెరువు వద్ద గణేశ్ నిమజ్జనాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, కలెక్టర్ పమేలా సత్పతి, నగరపాలక సంస్థ చాహత్ బాజ్‌పాయ్ వేర్వేరుగా పర్యవేక్షించారు. కలెక్టర్ స్వయంగా క్రేన్‌లో వెళ్లి గణేశుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అలాగే మానకొండూర్ చెరువు వద్ద నిమజ్జనాన్ని సీపీ అభిషేక్ మొహంతి స్వయంగా పర్యవేక్షించారు. కొత్తపల్లి చెరువు వద్ద రెండు క్రేన్లు, చింతకుంట కెనాల్ వద్ద ఒక క్రేన్ సహాయంతో నిమజ్జనం కొనసాగుతున్నది. కొత్తపల్లి చెరువు వద్దకు కొత్తపల్లి పట్టణంతో పాటు సమీపంలోని గ్రామాలు, కరీంనగర్ పట్టణానికి చెందిన వినాయక ప్రతిమలు నిమజ్జనానికి ఊరేగింపుగా తరలిరాగా, చింతకుంట కెనాల్ వద్ద రాంనగర్, పద్మనగర్, సమీప గ్రామాల నుంచి వినాయకులను తీసుకువచ్చి నిమజ్జనం చేస్తున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మేయర్ వై సునీల్‌రావు కొత్తపల్లి చెరువుతో పాటు చింతకుంట కెనాల్ వద్ద వినాయక నిమజ్జన తీరును పరిశీలించారు. కొత్తపల్లి చెరువు వద్ద మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజుతో కలిసి వినాయకుడిని నిమజ్జనం చేశారు. రాత్రి వరకు కొత్తపల్లి చెరువు వద్ద సుమారు 90 విగ్రహాలు నిమజ్జనం కాగా, చింతకుంట కెనాల్ వద్ద 40 వరకు విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. కొత్తపల్లి చెరువు వద్ద మంగళవారం ఉదయం వరకు సుమారు 600 విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉంది. కొత్తపల్లి పట్టణం తూర్పు వాడలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూకు రెడ్డి యూత్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా, రూ.56,116కు కలకొండ మల్లారెడ్డి, అభిలాష్‌రెడ్డి దక్కించుకున్నారు. వీణవంక, సైదాపూర్, ఇల్లందకుంట, తిమ్మాపూర్, శంకరపట్నం, కరీంనగర్, చిగురుమామిడి, గంగాధర మండల కేంద్రాలతోపాటు అన్ని గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా వీధులన్నీ కోలాహలంగా మారాయి. గణేశుడి శోభాయాత్రను నిర్వహించగా మహిళలు మంగళ హారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్లు, భజనల మధ్య వినాయకుడిని స్థానికంగా ఉన్న చెరువులు, కుంటలు, వరద కాలువల్లో నిమజ్జనం చేశారు. హుజూరాబాద్‌లోని కాకతీయ కెనాల్ వద్ద భారీ క్రేన్ల సహాయంతో నిమజ్జనం సజావుగా జరిగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్ పర్సన్ నిర్మల, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గంగాధర మండలం కొండన్నపల్లిలో లడ్డూ వేలం నిర్వహించగా తొర్రికొండ అంజయ్య రూ.40 వేలకు దక్కించుకున్నారు. మానకొండూర్ మండలం కొండపల్కలలో బ్యాంకు ఏరియా గణపతి లడ్డూ వేలం నిర్వహించగా, గ్రామానికి చెందిన మియాపురం శ్రీహరి రూ.20,016కు దక్కించుకున్నాడు.


పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి గణేశ్ నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న సీపీ

## బందోబస్తును పర్యవేక్షించిన సీపీ

రాంనగర్, సెప్టెంబర్ 16: గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా బందోబస్తులో పాల్గొనే పోలీస్ అధికారులతో సీపీ అభిషేక్ మొహంతి సోమవారం ఉదయం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని జాన్ విల్సన్ హాల్‌లో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నిమజ్జన కేంద్రాలయిన మానకొండూర్ చెరువు, చింతకుంట కెనాల్, కొత్తపల్లి చెరువుతో పాటు, గణేశ్ శోభాయాత్ర జరిగే రూట్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఇతర ముఖ్యమైన చోట్ల పూర్తి స్థాయిలో సీసీ కెమెరాల ఏర్పాటు చేశామని, పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో రూఫ్ టాప్‌లో సైతం బందోబస్త్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా పోలీసులు జారీచేసిన నియమాలు ఉల్లంఘించి ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శాంతి భద్రతలు ఎ.లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్ (సి.ఎస్.బి.), నరేందర్ (టౌన్), కాశయ్య, మాధవి, విజయ్ కుమార్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


చింతకుంట కెనాల్‌లో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు


హుజూరాబాద్ టౌన్: గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక


తిమ్మాపూర్: ఎల్‌ఎండీలో వినాయకుడిని తెప్పపై నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకుడు


శంకరపట్నం: కేశవపట్నంలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


గంగాధర మండల కేంద్రంలో గణనాథుడి నిమజ్జనోత్సవంలో భక్తులు


హుజూరాబాద్ టౌన్: నిమజ్జనంలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

## మూఢనమ్మకాలతో ఆర్థిక దోపిడీకి గురవుతున్న సామాన్యులు

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 16: మూఢనమ్మకాలతోనే సామాన్య ప్రజలు ఆర్థిక దోపిడికి గురవుతున్నారని ప్రముఖ హేతువాద, కవి, విమర్శకుడు డాక్టర్ మలయశ్రీ పేర్కొన్నారు. భారత నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఫిలిమ్ భవనంలో నిర్వహించిన పెరియార్ ఇ.వి. రామస్వామి 146 జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, ఆదిమ కాలం నుంచి నేటి ఆధునిక సమాజం వరకు మనిషి హేతుబద్ధంగా శాస్త్రీయంగా ఆలోచించడం వల్లే ప్రగతి సాధ్యమవుతున్నదని తెలిపారు. మధ్య యుగం నుంచి ఏర్పడిన దేవుడు, మతం ఆధునిక సమాజం వరకు వారసత్వంగా వచ్చినవేనన్నారు. వాటికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని స్పష్టం చేశారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా మనిషి ఆలోచన, జీవన విధానం అనునిత్యం మారాలని పిలుపునిచ్చారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ, పెరియార్ ఇ.వి. రామస్వామి అజ్ఞానానికి అసమానతలకు కుల, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా జీవితకాలం అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సైకాలజీ తరగతులను బోధించడం అంటే దళిత పిల్లలను మూఢ నమ్మకాల ఊబిలోకి నెట్టి వేయడమేనన్నారు. పెరియార్ పోరాటాల స్ఫూర్తితో కులగణన చేసే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం జాతీయ అధ్యక్షుడు జేడి సారయ్య, సోషల్ జస్టిస్ నాయకుడు ప్రభంజన్ యాదవ్, విశాంత్ర రెవెన్యూ అధికారి గంగారం, బహుజన నాయకుడు సుతారి లచ్చన్న, బుద్దిస్ట్ లక్ష్మణ్ బుద్ధి, ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు చంద్రమౌళి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్పార్టకస్, నాయకులు వివేక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగా చాంపియన్స్‌గా కరీంనగర్ జిల్లా జట్టు


ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న జిల్లా జట్టు క్రీడాకారులు

కొత్తపల్లి, సెప్టెంబర్ 16 : రాష్ట్రస్థాయి యోగా చాంపియన్స్‌గా కరీంనగర్ జిల్లా జట్టు క్రీడాకారులు నిలిచారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 14, 15 వరకు జరిగిన 11వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొన్న జిల్లా జట్టు క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపి, 116 పాయింట్లతో మొదటిస్థానంలో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు 7 బంగారు పతకాలు 4 రజత పతకాలు, 4 కాంస్య పతకాలు సాధించారు. అలాగే జిల్లాకు చెందిన యోగా క్రీడాకారులు అత్యధికంగా 16 మంది క్రీడాకారులు రాష్ట్ర జట్టు తరపున అక్టోబర్‌లో జరిగే జాతీయస్థాయి యోగాసన పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సర్దార్ రవీందర్‌సింగ్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. వీరిని డీవైఎస్‌వో శ్రీనివాస్, యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, కోచ్‌లు రామకృష్ణ, కిష్టయ్య, మల్లేశ్వరి, స్వరూప, చారి, పలు జిల్లాల యోగా అసోసియేషన్ కార్యదర్శులు అభినందించారు.

## రెండో రోజు విశ్వకర్మభగవానుడి బ్రహ్మోత్సవాలు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 16 : కమాన్‌చౌరస్తాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం విశేష పూజలు చేశారు. స్థాపిత దేవతారాధనలు, గాయత్రీ విశ్వకర్మ హోమం నిర్వహించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం టవర్ సర్కిల్‌లో జరిగిన అన్నదాన కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్, ఈవో ఉడుతల వెంకన్న, ధర్మకర్తలు శ్రీరామోజు నాగరాజు, వేములవాడ రవీంద్రాచారి, మియాపురం వీరబ్రహ్మాచారి, అనసూరి రమేశ్, ముత్తోజు రామ్ కుమార్, అస్తాపురం లీల, అర్చకుడు దురిశేటి బ్రహ్మాచారి తదితరులున్నారు.

## ఇంజినీర్లు, న్యాయవాదులకు సన్మానం

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 16: బొమ్మకల్‌లో ఇంజినీర్స్ డేను పురస్కరించుకొని జిల్లాలోని ప్రముఖ ఇంజినీర్స్ కోల అన్నారెడ్డి, శ్రీరాముల శ్రీనివాస్, అస అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాళేశ్వరి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కంది జ్యోతి, కస్తూరి భారతి, సిద్ధి సరిత, కొండ రాధిక, రాగి వందన, కొండూరి రాధిక, చింతల లావణ్య, కొండ రాంబాబు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే బొమ్మకల్‌లో ప్రపంచ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలోని న్యాయవాదులు లయన్ వెంగల్‌దాసు శ్రీనివాస్, లయన్ బట్టు రాజేందర్, లయన్ బట్టు వెంకటేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ లయన్ చింతల కిషన్‌పటేల్, క్లబ్ సెక్రటరీ బట్టు రాజేందర్, మాచినేని చక్రధర్ లయన్ చింతల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాపాలన దినోత్సవం

కలెక్టరేట్, సెప్టెంబర్ 16: నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఉదయం 9-40 నుంచి 19-30 గంటల వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు.

## ఘనంగా వొడితల రాజేశ్వర్ రావు జయంతి


హుజూరాబాద్ టౌన్: రాజేశ్వర్‌రావుకు నివాళులర్పించిన కుమారులు కిషన్ రావు, శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, కుటుంబ సభ్యులు

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 16: పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ వొడితల రాజేశ్వర్ రావు 93వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సైదాపూర్ క్రాస్ కూడలిలో ఉన్న రాజేశ్వర్ రావు విగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, వొడితల కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేశ్వర్ రావు కుమారులు కిషన్ రావు, శ్రీనివాస రావుతో పాటు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్, ఇతర కుటుంబ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరై హుజూరాబాద్‌కు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కాకతీయ కెనాల్ హుజూరాబాద్ ప్రాంతానికి రావడానికి రాజేశ్వర్‌రావు ఎంతో కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని రాజేశ్వర్‌రావు మనుమడు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పేర్కొన్నారు.

**కిట్స్ కళాశాలలో..**


కిట్స్‌లో రాజేశ్వర్ రావుకు నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్ 16: మండలంలోని సింగాపూర్‌లో గల కిట్స్ కళాశాల సమావేశ మందిరంలో సోమవారం మాజీ రాజ్యసభ సభ్యుడు వొడితల రాజేశ్వర్‌రావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు చిత్రపటానికి కిట్స్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీ ఇంద్రనీల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ యోగేశ్ పుండలిక్, డాక్టర్ కే. రవీంద్రబాబు, భాస్కర్ ప్రకాశ్, నరేశ్, వంశీ, శివారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు స్వతంత్ర శాఖ ఏర్పాటుపై నిర్లక్ష్యమెందుకు?

కలెక్టరేట్, సెప్టెంబర్ 16 : దివ్యాంగులు, వయోవృద్ధులు, లింగ మార్పిడి చేయించుకున్న వారికి స్వతంత్ర శాఖ ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం వెనుక ఆంతర్యమేంటని తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మనోహర్ ప్రశ్నించారు. సోమవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం స్వతంత్ర శాఖ ఏర్పాటుకు ఉత్తర్వులు వెలువరించి ఏడాది గడిచినా రాష్ట్రప్రభుత్వం చోద్యం చూస్తున్నదని విమర్శించారు. సిబ్బంది కొరతను సాకుగా చూపుతూ, ఇప్పటికీ మహిళా సంక్షేమ శాఖలోనే దివ్యాంగుల శాఖను కొనసాగిస్తుండడం శోచనీయమన్నారు. ఐసీడీఎస్ చేపట్టే పథకాలపైనే ఆశాఖ అధికారులు దృష్టి సారిస్తుండడంతో దివ్యాంగుల సమస్యల పరిష్కారం అటకెక్కిందని విమర్శించారు. మహారాష్ట్రతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా దివ్యాంగుల కోసం ప్రత్యేక శాఖ కొనసాగుతుండగా, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన పెన్షన్ పెంపు హామీతో పాటు ప్రత్యేక శాఖ ఏర్పాటు ప్రక్రియను సందుగలో పెట్టి తాళం వేసిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో దివ్యాంగుల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల నుంచి పదుల సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

## దవాఖాన కూడలిలో ఫ్లడ్ లైట్ల ప్రారంభం

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 16: పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో ఏరియా దవాఖాన కూడలి వద్ద సోమవారం రాత్రి ఫ్లడ్ లైట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వ దవాఖాన ముందు రూ.1.50 లక్షలతో ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్, కౌన్సిలర్లు తొగరు సదానందం, ముత్యం రాజు, శ్రీనివాస్ గౌడ్, కిషన్, కుమారస్వామి, సుశీల, లావణ్య, రమేశ్, ఇమ్రాన్, కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

శంకరపట్నం, సెప్టెంబర్ 16: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మసీదులు, దర్గాలను అలంకరించారు. ర్యాలీలు నిర్వహించి, అన్నదానాలు చేశారు. కరీంపేట్ గ్రామంలో మౌలానా మహ్మద్ సల్మాన్ రజా ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకొన్నారు. గ్రామ వీధుల్లో పతాకాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు హిందూ యువకులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఖాజా పాషా, మసీద్ అధ్యక్షుడు అజీమొద్దీన్, సర్దార్, చాన్‌పాషా, అఫ్జల్, జాకీర్, ఖాజా, జావీద్, సమేద్, నాయకులు రాసమల్ల శ్రీనివాస్, గోపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'నవోదయ'లో ముగిసిన కళోత్సవాలు

చొప్పదండి, సెప్టెంబర్ 16: జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్లస్టర్ స్థాయి కళోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల నవోదయ విద్యాలయాల విద్యారులు పాల్గొని చక్కని ప్రతిభ చూపారు. ఈ ఉత్సవాల ముగింపు వేడుకలకు చొప్పదండి మున్సిపల్ కమిషనర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఉల్లాసాన్ని కలిగిస్తాయని, సంప్రదాయాలను తెలియపరుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగతాయారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

గంగాధర, సెప్టెంబర్ 16: మండల కేంద్రానికి చెందిన ఎండీ షహీద్‌పాషా కరెంటు ప్రమాదంలో గాయపడి చేతిని కోల్పోయాడు. సోమవారం గంగాధర ప్రభుత్వ పాఠశాల 2007-08 10వ తరగతి పూర్వ విద్యార్థులు రూ.18 వేలు జమ చేసి మాజీ సర్పంచ్ మడ్లపెల్లి గంగాధర చేతుల మీదుగా పాషాకు అందజేశారు. ఇక్కడ బండారి వెంకటేశ్, పడాల రాము, గంగాధర గంగరాజు, ప్యాట సంతోష్, ప్యాట సునీల్, అనిల్ తదితరులు ఉన్నారు.

## మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 16: కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని శివారులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వచ్చి బోగ లక్ష్మి అనే మహిళా మెడలో నుంచి రెండున్నర తులాల పుస్తెలతాడు లాక్కొని పారిపోయారు. దీంతో బాధితురాలు కన్నీరుమున్నీరుగా విలపించింది.